క్లుప్తంగా

మున్సిఫ్ కోర్టు మంజూరు చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

సైదాపూర్: సైదాపూర్ మండల కేంద్రంలో మున్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఏర్పాటు చేయాలని మండలానికి చెందిన న్యాయవాదులు శనివారం కరీంనగర్ ప్రిన్సిపల్ సెషన్ జడ్జి శివ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. శంకరపట్నం, సైదాపూర్ రెండు మండలాలకు సైదాపూర్ కేంద్రంగా కోర్టు మంజూరు చేయాలని, ఈ ప్రాంత ప్రజలకు న్యాయపరమైన సేవలు అందుబాటులోకి తేవాలని వినతిపత్రంలో కోరారు. హుజూరాబాద్ కోర్టుకు ఈ ప్రాంత ప్రజలకు దూరం అవుతుందని, వృద్ధులు, మహిళలకు కోర్టుకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు అందె వెంకటేశ్వర్‌రావు, కొరిమి నర్సింహారావు, ప్రవీణ్, అనిల్‌కుమార్, రుద్రారపు రవి, వడిజె భీంరావు, బాగోతం కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు



నివేదికలు పరిశీలిస్తున్న డీఆర్‌డీవో శ్రీనివాస్

సైదాపూర్: మండలంలో గతేడాది కాలంలో చేసిన ఉపాధి హామీ పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీ నివేదికలను శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావేదికలో చదివి వినిపించారు. మండలంలోని 26 గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు రూ.5,37,73,933 పనులు జరిగినట్లు వెల్లడించారు. అందులో నిధులు దుర్వినియోగం జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. పనుల్లో అవకతవకలు, నిధుల దుర్వినియోగంపై చర్యలుంటాయని డీఆర్‌డీవో శ్రీనివాస్ తెలిపారు. ఎంపీడీవో యాదగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న తిరుపతిరెడ్డి

చిగురుమామిడి: మండలంలోని ఓగులాపూర్‌లో రూ.5లక్షలతో ఏర్పాటు చేయనున్న ఓపెన్ జిమ్‌కు శనివారం హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి భూమిపూజ చేశారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుతుబుద్దీన్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయిని వేణుగోపాల్, అందె సురేశ్, ఎంద్ర అనిల్‌కుమార్, ఎనగందుల లక్ష్మణ్, బద్దం నారాయణరెడ్డి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, బద్దం సుధాకర్‌రెడ్డి, ముస్కు తిరుపతిరెడ్డి, బూడిద వెంకట్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

జమ్మికుంట: జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధికార ప్రతినిధిగా పట్టణానికి చెందిన ఇటిక్యాల స్వరూపను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య, జిల్లా అధ్యక్షుడు ఇమ్మడి ప్రణయ్ శనివారం నియామక పత్రం అందజేశారు.

ఆర్ట్ టీచర్‌కు సన్మానం



కిషన్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్ట్ టీచర్‌గా పని చేస్తున్న బొద్దుల కిషన్‌ను కలెక్టర్ పమేలా సత్పతి అభినందించారు. పాఠశాల ప్రహరీపై వాల్ పెయింటింగ్‌ను వాట్సప్ ద్వారా చూసిన కలెక్టర్.. కిషన్‌ను సన్మానించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ మేరకు శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో కిషన్‌ను సన్మానించారు. హెచ్‌ఎం దీక్షితుల శ్రీనివాస్, కానిగంటి రాజమౌళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ కావేరీ సీడ్‌ప్లాంట్‌లో శనివారం మెడికవర్ ఆస్పత్రి వైద్యులు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ప్లాంట్‌లో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. 250 మంది కార్మికులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు ఆస్పత్రి హెడ్ కిరణ్, మేనేజర్ కరుణాకర్, సంజయ్, శ్రీకాంత్ తెలిపారు.



శంకరపట్నం: బతుకమ్మ పేర్చుతున్న టీచర్



చొప్పదండి: ఆర్నకొండ పాఠశాలలో..



హుజూరాబాద్‌లో..



చిగురుమామిడి: చిన్నముల్కనూర్ ఆదర్శపాఠశాలలో..



తిమ్మాపూర్: అల్గునూర్ పాఠశాలలో..

ముందస్తు పూల సింగిడి

- ఆడిపాడిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ముందస్తు బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలు పేర్చి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆడిపాడారు. పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు, సిబ్బంది పాల్గొన్నారు.

– జమ్మికుంట/రామడుగు/సైదాపూర్/గంగాధర/చిగురుమామిడి/శంకరపట్నం/మానకొండూర్/హుజూరాబాద్/చొప్పదండి



జమ్మికుంట: వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు



గంగాధర: గట్టుభూత్కూర్‌లో బతుకమ్మ వేడుకల్లో చిన్నారులు



రామడుగు: కళాశాలలో బతుకమ్మ వేడుకలు



శంకరపట్నం: మొలంగూర్‌లో..



మానకొండూర్‌లో..



సైదాపూర్: వెన్కెపల్లి పాఠశాలలో..

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- హుజూరాబాద్ ఏసీపీ మాధవి



మాట్లాడుతున్న ఏసీపీ మాధవి

వీణవంక: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో శనివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇళ్లలో సోదాలు నిర్వహించి సరైన పత్రాలు లేని 22 ట్రాక్టర్లు, 18ద్విచక్రవాహనాలకు జరిమానా విధించారు. మూడు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా హుజూరాబాద్ ఏసీపీ మాధవి మాట్లాడుతూ, గ్రామాల్లో అనుమానితులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సమస్య తలెత్తితే 1930 నంబర్ కాల్ చేయాలన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ, వీణవంక, ఇల్లందకుంట, సైదాపూర్, జమ్మికుంట, హుజూరాబాద్ ఎస్సైలు తిరుపతి, క్రాంతికుమార్, తిరుపతి, సతీశ్, రాధాకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కోడిగుడ్ల అక్రమాలపై విచారణ



విచారణ చేస్తున్న అధికారులు

హుజూరాబాద్: ఇటీవల పట్టణంలోని వరంగల్ రోడ్డులో గల ఓ వైన్స్ పర్మిట్ రూంలో అంగన్‌వాడీ కోడిగుడ్ల విక్రయాలపై శనివారం జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి విచారణ చేపట్టారు. పర్మిట్ రూం నిర్వాహకుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్మిట్ రూంలో కోడిగుడ్ల ట్రేలు దర్శనమివ్వడంతో కుంగుతిన్నారు. అనంతరం మండలంలోని రంగాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించి మాట్లాడారు. బాలింతలు, గర్భిణులు, మూడేళ్లలోపు పిల్లలకు పోషకాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కోడిగుడ్లతో పాటు ఇతర పౌష్టికాహార పదార్థాలు పంపిణీ చేస్తుందన్నారు. కొంత మంది వ్యక్తుల నిర్లక్ష్యం వల్ల అంగన్వాడీ కేంద్రాలకు పంపిణీ చేసిన కోడిగుడ్లు పర్మిట్ రూంలో మద్యం సేవించే వారికి ఆహారంగా మారడం దురదృష్టకరమైన సంఘటనన్నారు. ఈ ఘటనపై హుజూరాబాద్ ఎక్సైజ్ ఎస్సై వినోద్‌కుమార్‌తో కలిసి విచారణ జరిపినట్లు తెలిపారు. విచారణలో రంగాపూర్ అంగన్‌వాడీ కేంద్రం టీచర్ రాజమణి భర్త కోడిగుడ్లను పర్మిట్ రూముకు తీసుకెళ్లినట్లు తేలిందని, ఈ ఘటనపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కేంద్రాలను తనిఖీ చేయకుండా నిర్లక్ష్యం వహించిన సూపర్‌వైజర్ శిరీషపై శాఖాపరమైన చర్యలకు సిఫార్సు చేసినట్లు పేర్కొన్నారు. ఆమె వెంట సీడీపీవో సుగుణ, అధికారులు ఉన్నారు.

నానో యూరియా పిచికారీపై అవగాహన



డ్రోన్ ద్వారా నానో యూరియా మిక్సింగ్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

చొప్పదండి: నానో యూరియా పిచికారీ చేయడం వల్ల వరిలో చీడపీడల ఉధృతి తగ్గుతుందని ఇఫ్కో జిల్లా మేనేజర్ బాలాజి అన్నారు. శనివారం పట్టణంలోని పాత వెదురుగట్ట రోడ్డులోని గుర్రం దేవేందర్‌రెడ్డి వరి క్షేత్రంలో నానో యూరియా పిచికారీపై రైతులకు ఏవో వంశీకృష్ణ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించగా, బాలాజి హాజరై మాట్లాడారు. ఎకరాకు 500 మిల్లీ లీటర్లు డ్రోన్ ద్వారా పిచికారీ చేసినట్లు తెలిపారు. గంగాధర ఏడీఏ ప్రియదర్శిని, పీఏసీఎస్ సీఈవో తిరుపతిరెడ్డి, ఏఈవో రమ్య జోత్స్న పాల్గొన్నారు.

తాడికల్ గోదాంలో యూరియా పంపిణీ

శంకరపట్నం: మండలంలోని తాడికల్ సహకార సంఘం గోదాంలో శనివారం రైతులకు 450 బస్తాల యూరియా పంపిణీ చేశారు. రెండు బస్తాల చొప్పున పంపిణీ చేసినట్లు సంఘం అసిస్టెంట్ సీఈవో వేణుమాధవ్ తెలిపారు.

సర్వేయర్‌పై ఫిర్యాదు

శంకరపట్నం: సమాచారం ఇవ్వకుండా తమ భూముల్లో సర్వేయర్ సర్వే చేశారని మండలంలోని మెట్‌పల్లి రెవెన్యూ పరిధిలోని 23మంది రైతులు తహసీల్దార్ సురేఖకు ఫిర్యాదు చేశారు. ఓ వ్యక్తి సర్వే చేస్తుంటే తమకు సమాచారం ఇవ్వలేదని, భూముల్లో ఖనీలు పాతడంతో వరిపంట దెబ్బతిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. సర్వే నిలిపివేయాలని తహసీల్దార్‌ను కోరారు.

చెరువు కబ్జాపై..

గంగాధర: మండలంలోని గర్శకుర్తి గ్రామంలో ఊర చెరువును ఓ వ్యక్తి కబ్జా చేయడంతో పాటు, చెరువు నీటితో పంట సాగు చేస్తున్నాడని గ్రామానికి చెందిన మత్స్యకారులు శనివారం తహసీల్దార్ రజితకు ఫిర్యాదు చేశారు. విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కలిసి సమస్య వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే చెరువు శిఖంపై సర్వే నిర్వహించాలని తహసీల్దార్‌కు సూచించారు.

పీహెచ్‌సీలో నార్మల్ డెలివరీ

చొప్పదండి: పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఓ గర్భిణికి వైద్యులు, సిబ్బంది నార్మల్ డెలివరీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బీపీ, షుగర్ మందులు వాడేవారు పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్న మాత్రలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మెడికల్ అధికారి శ్రీకీర్తన, సూపర్‌వైజర్ శ్రీదేవి, సీహెచ్‌వో వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగులు అందజేత

చొప్పదండి: మండలంలోని రేవెళ్ళి, పెద్దకుర్మపల్లి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మాజీ జెడ్పీటీసీ మాచర్ల సౌజన్య, వినయ్‌కుమార్ దంపతులు శనివారం స్కూల్ బ్యాగులు అందజేశారు. హెచ్‌ఎం ఆనందం, ముల్కల కుమార్, ఇరుగురాల అజయ్య తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

గన్నేరువరం: మానేరువాగుపై వంతెన కోసం రూ.77 కోట్ల నిధులు మంజూరు కోసం కేంద్ర మంత్రి సంజయ్‌కుమార్‌కు పలుమార్లు విజ్ఞప్తి చేసి చర్చలు జరిపిన రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పుల్లెల పవన్‌కుమార్, నాయకుడు సొల్లు అజయ్‌వర్మను శనివారం మండల కేంద్రంలో మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు బొద్దు బాలయ్య ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా బ్రిడ్జి కోసం కృషి చేసిన బండి సంజయ్, కవ్వంపల్లి సత్యనారాయణకు జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి చిట్కూరి అనంతరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు పక్కన చెత్త వేయొద్దు

జమ్మికుంట: పట్టణంలోని రాజరాజేశ్వర రెసిడెన్స్ సమీపంలో రోడ్డు పక్కన చెత్త, ప్లాస్టిక్ వేయకుండా శనివారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా ముగ్గులు వేసి, గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ బోర్డు ఏర్పాటు చేశారు. మున్సిపల్ మేనేజర్ రాజిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందిని భర్తీ చేయాలి

వీణవంక: మండలంలోని చల్లూరు పీహెచ్‌సీలో ఖాళీలను భర్తీ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సంపత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆరోగ్య కేంద్రాన్ని మండల కార్యదర్శి పిల్లి రవియాదవ్‌తో కలిసి సందర్శించారు. ఒక మెడికల్ ఆఫీసర్, ఫార్మసిస్టు, హెడ్ నర్సు, నలుగురు ఏఎన్‌ఎంలు, ఇతర సిబ్బంది లేరని పేర్కొన్నారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు

- జిల్లా ఇంటర్ విద్యాధికారి గంగాధర్



మాట్లాడుతున్న డీఐఈవో గంగాధర్

చిగురుమామిడి: ఇంటర్ విద్యార్థులు ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జిల్లా ఇంటర్ విద్యాధికారి గంగాధర్ అన్నారు. శనివారం చిగురుమామిడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. కష్టపడి చదివి కళాశాలకు పేరుప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. ప్రిన్సిపాల్ శశిధర్‌శర్మ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

క్వాంటం కంప్యూటర్లతో ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రాఘువేంద్రరావు

హుజూరాబాద్‌రూరల్: క్వాంటం కంప్యూటర్లతో సమస్యల సాధన మరింత సులభమవుతుందని బెంగళూరుకు చెందిన పీఈఎస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కె.రాఘువేంద్రరావు అన్నారు. శనివారం సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో డైరెక్టర్ డాక్టర్ శంకర్ అధ్యక్షతన జరిగిన ఒక రోజు ఇంట్రడక్షన్ టు క్వాంటం కంప్యూటింగ్ కార్యశాలలో పాల్గొని మాట్లాడారు. క్వాంటం కంప్యూటర్‌లో భౌతిక, గణితశాస్త్ర సూత్రాలు ఉంటాయని, క్వాంటం కంప్యూటింగ్‌ను సులభంగా అర్థం చేసుకోవచ్చన్నారు. కార్యశాల సమన్వయకర్త ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ తెలంగాణ అధ్యక్షుడు, కళాశాల రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాజేశ్వరరావు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కుంగిన రోడ్డుపై తాత్కాలిక మరమ్మతు



సాక్షి స్పందన

మానకొండూర్: మండలంలోని చెంజర్ల శివారులో కుంగిన రోడ్డుతో వాహనదారుల ఇబ్బందులపై శనివారం 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో ఆర్‌అండ్‌బీ ఏఈ రాజశేఖర్ స్పందించారు. జేసీబీతో మట్టి చదును చేసి తాత్కాలిక మరమ్మతు చేపట్టారు. పైపులైన్ పగిలిన చోట కల్వర్టు ఏర్పాటుకు ఎస్టిమేట్ చేసి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామని ఏఈ తెలిపారు.

జీపీ కార్యాలయాల ముట్టడి



బేతిగల్‌లో కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న దివ్యాంగులు



గంగాధర: నిరసన తెలుపుతున్న పెన్షన్‌దారులు

వీణవంక/గంగాధర/శంకరపట్నం/హుజూరాబాద్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం పింఛన్‌దారులకు డబ్బులు పెంచుతామని హామీ ఇచ్చి కాలయాపన చేయడాన్ని నిరసిస్తూ వీణవంక మండలం బేతిగల్‌లో పింఛన్‌దారులు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం జీపీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మోరే అరుణ్ తదితరులు ఉన్నారు. గంగాధర మండలం ర్యాలపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్, శంకరపట్నంలో అధ్యక్షుడు శ్రీనివాస్, హుజూరాబాద్‌రూరల్ మండలం పోతిరెడ్డిపేటలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవునూరి రవీందర్, తెలంగాణ బీసీ సిటిజన్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

రామడుగు: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ డిమాండ్ చేశారు. శనివారం రామడుగు మండలం గోపాల్‌రావుపేట గ్రామపంచాయతీ వద్ద నిరసన తెలుపుతున్న వికలాంగులకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా ప్రభుత్వం వికలాంగులకు పింఛన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ శ్రీరాములపల్లి పంచాయతీ వద్ద ఆందోళన చేసి కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ మాదిగ, నాయకులు కొత్తూరి రాజన్నమాదిగ, తడగొండ శంకర్, రావుల శంకర్ గౌడ్, సంజీవ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు సైకిళ్లు అందజేత



సైకిళ్లు అందజేస్తున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): అల్ఫోర్స్ విద్యా సంస్థలు, బీఎస్‌ఏ హర్క్యులస్ సంయుక్తంగా కరీంనగర్ వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్‌జెన్ నెక్ట్స్ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చాటారు. ఈసందర్భంగా ప్రతిభచాటిన విద్యార్థులకు ఆ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి శనివారం సైకిళ్లు అందజేశారు. బాలికల విభాగంలో జి.బుషిగ్న, బాలుర విభాగంలో జి.రుషికేష్‌లు ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయిలో ఉత్తమ ర్యాంకులు కైవసం చేసుకొని సైకిళ్లను గెలుచుకున్నట్లు తెలిపారు. పర్యావరణ సంరక్షణకు ప్రతిఒక్కరూ కంకణబద్ధులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్‌ఏ–హర్క్యులస్ కంపెనీ ప్రతినిధులు శంకర్, జాన్, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెట్రోలు పోసుకుని వ్యక్తి ఆత్మహత్యాయత్నం



గోపాల్ ఒంటిపై నీళ్లు పోస్తున్న స్థానికులు

మానకొండూర్: తన ఇంటిపై నుంచి విద్యుత్ లైన్ వేయొద్దని మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన ఆకుల గోపాల్ ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. బాధితుడు తెలిపిన వివరాలు.. గోపాల్ కుటుంబం ఉద్యోగ రీత్యా గోదావరిఖనిలో ఉంటున్నారు. అప్పుడప్పుడు గట్టుదుద్దెనపల్లికి వచ్చి వెళ్తుండేవారు. కాగా, గతంలో విద్యుత్ అధికారులు గ్రామంలోని ఓ సెల్ టవర్‌కు విద్యుత్ అందించేందుకు గోపాల్ ఇంటిపై భాగం నుంచి లైన్ తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న గోపాల్ విద్యుత్ తీగలతో ప్రమాదం పొంచి ఉందని, తొలగించాలని గతంలోనే పలుమార్లు విద్యుత్ అధికారులను కోరారు. ఇటీవల హైవే పనుల్లో భాగంగా గోపాల్ ఇంటికి సమీపంలో కాంట్రాక్టర్ విద్యుత్ స్తంభం ఏర్పాటు చేశారు. మళ్లీ అతడి ఇంటిపై నుంచి హైటెన్షన్ విద్యుత్ తీగలద్వారా సెల్ టవర్‌కు కరెంట్ సరాఫరా చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తుండగా శుక్రవారం గోపాల్ అభ్యంతరం వ్యక్తం చేశాడు. ఈ మేరకు బాధితుడు, విద్యుత్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. కాగా శనివారం సీఐ సంజీవ్ గట్టుదుద్దెనపల్లికి చేరుకుని గోపాల్ ఇంటిపై ఉన్న విద్యుత్ తీగలను పరిశీలించి బాధితుడితో మాట్లాడి వెళ్లిపోయారు. ఈక్రమంలో మనస్తాపానికి గురైన గోపాల్ ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు వెంటనే అడ్డుకుని బకెట్‌తో నీళ్లు పోశారు. అనంతరం చెంజర్ల సబ్ స్టేషన్ ఏఈ లక్ష్మణమూర్తి, బాధితుడు గోపాల్‌తో సీఐ మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఏఈ తెలిపారు.

పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

కరీంనగర్‌క్రైం: పెళ్లి చేసుకుంటానని ఓ యువతిని మోసం చేయడంతో పాటు ఆమె ఇంటికి నిప్పంటించడానికి యత్నించిన యువకుడిని అరెస్ట్ చేసినట్లు కరీంనగర్ వన్‌టౌన్ ఎస్సై రాజన్న తెలిపారు. ఆయన వివకాల ప్రకారం.. నగరానికి చెందిన చెక్కిళ్ల శివసాయి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న యువతిని పరిచయం చేసుకున్నాడు. తరచూ ఆమెతో ఫోన్‌లో మాట్లాడుతూ పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. గతేడాది ఆగస్టులో ఆమె నుంచి రెండు తులాల బంగారం తీసుకున్నాడు. మద్యానికి బానిసై ఎలాంటి పని చేయకపోవడంతో యువతి శివసాయిని దూరంగా పెట్టింది. ఆగ్రహానికి గురైన శివసాయి ఈ నెల 7న అర్ధరాత్రి తన స్నేహితుడితో కలిసి నగరంలోని యువతి ఇంటికెళ్లాడు. ఇంటి ముందు పెట్రోల్ పోసి నిప్పంటించడానికి యత్నించాడు. కుటుంబసభ్యులు కేకలు వేయగా అక్కడి నుంచి పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు శివసాయిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.